"వెనక ఎవరో తరుముతున్నట్టు అట్లా నడుస్తా రెందుకు. చీర చూడండి ఎట్లా తడిసిందో!"

నిజమే—మక్కిమీద చీరంతా తడిసి వంటి కాంతి బయట పడు తోంది. సిగ్గూ, కోపమూ రెండూ కలిగాయి. ఠక్కున ఆగి "ఆడపిల్లల వెంట నడవటం సరదా ఏమిటి మీకు? ముందు వెళ్ళండి" అన్నది.

సుందరం ముందువెళ్ళి నవ్వాడు. ఎంత ఆపుకున్నా పెదిమలమీద తనకూ నవ్వు నిల్చింది.

ఆ రాత్రి కళ్లు మూసుకుంటే—మంగళ వాయిద్యాలూ-మంత్రాలూ చెవుల్లో హోరెత్తాయి. పడుకునే. కొత్త పెళ్ళికూతురిలా సిగ్గుపడి వంటి నిండా రగ్గు కప్పుకుంది.

పెళ్ళి చేసుకుంటాడేమో? చేసుకోక పబ్బం గడుపుకోడానికైతే తను అంగీకరిస్తుందేమిటి? ఎట్లా తెలుసుకోవడం! కన్నెమనసులో తియ్యటి ఆశ అడగటానికి సాహసాన్నిచ్చింది.

"నాన్న కట్నం యివ్వలేరు. పెళ్ళి చేసుకుంటారా?" అడిగింది ఒకరోజు.

"కట్నం అవసరంలేదు. నువ్వు చాలు."

బాలాంబ కళ్ళతో తప్ప—నోటితో కృతజ్ఞతని వెల్ల చెయ్యలేక పోయింది.

తన కన్నెచెర వదిలించడానికి నాన్న పడుతున్న అవస్థ గ్రహించ లేనంత పసిదేమీ కాదు తను. పైకి వ్యక్తం చెయ్యకపోయినా, నాన్న తన విషయంలో పడుతున్న బాధ తనకి తెలుసు.

తనుగాక ముగ్గురాడపిల్లలు. ఇద్దరు మగపిల్లలు. పొలాలమీద వచ్చే ఆదాయమూ అంతంత మాత్రమే, పైగా బాకీలు. సంసారం ఎట్లా ఈడ్చుక వస్తున్నాడో తనకు తెలుసు.

సుందరం విషయం చెబితే సంతోషిస్తాడు. విషయం చెప్పడానికి

